# మిడ్‌నైట్ ఛానెల్

## ఎం. ఆర్. రాజీ

**చిన్నప్పట్నుంచి ఒక్కర్తినే కూతుర్నవడం వలనేమో అతి గారాబంగా పెంచారు నన్ను. ఆడింది ఆట పాడింది పాట. కాలు కింద పెడితే కందిపోతుందేమో. నన్నంత అపురూపం నేనంటే మా ఇంట్లో. ఎంత పుణ్యం చేసుకుంటేనే గాని అలాంటి అదృష్టం దక్కదు.**

**చిన్నతనపు అల్లరి, చలాకీతనం అన్నీ నాకింకా గుర్తున్నాయి.**

నాన్నగారు వొద్దని అరుస్తున్నా సముద్రపు ఒడ్డుకి వెళ్లి ఆడుకోవడం, పిచ్చుక గూళ్లు కట్టుకుని, ఫ్రెండ్స్ అందరితో పిడత కింద పప్పు, కారం రాసిన మామిడి కాయ ముక్కలు, ఉల్లిపాయ ముక్కలు పెట్టి, నిమ్మ రసం పిండిన బజ్జీలు తినడం... అన్నీ గుర్తున్నాయి.

ప్రకృతి అన్నా, ప్రకృతిలోని అందాలన్నా నాకెంతో ఇష్టం. అందుకే ప్రకృతిని ఆరాధించడం నా దినచర్య లో ఓ భాగం అయిపోయింది ఇప్పటికీ.

పెళ్లి వయసు రాకుండానే నాన్నగారు, అమ్మ తొందరపడసాగారు. నాకో మంచి సంబంధం చూసి పెళ్లి చెయ్యాలని.

నిజం చెప్పొద్దూ!

అదృష్టం అక్కడా నాకోసం వేచే ఉందనుకుంటా!

అందుకే నాకు శ్రీసూర్యతో పెళ్లయింది. నాన్న గారు తన అంతస్థుకు మించే ఖర్చు పెట్టి పెళ్లి చేశారు.

హనీమూన్‌కి సింగపూర్ పంపించారు. అదీ హోటల్ అకామిడేషన్‌తో సహా అన్నీ అమర్చి, నిజంగా సింగపూర్ అందాలు శ్రీవారితో కలిసి చూస్తుంటే నా జన్మ ధన్యమే అయ్యిందనిపించింది.

నన్ను పుట్టింట్లో ఉన్నపుడు కంటికి రెప్పలా చూసుకునే తల్లీ, తండ్రీ పెళ్లయ్యాక శ్రీసూర్య, ఇంతకంటే ఆడజన్మకదృష్టం ఉంటుందని అనుకోను నేను.

కావలసినవన్నీ కనుసైగతోనే అందించే శ్రీవారు ఒకవైపైతే, కోడల్ని కూడా కూతురి కంటే ప్రేమగా చూసుకునే అత్తగారు మరోవైపు. అత్తలందరిలోకి

### ఇది ఇలా జరిగితే...!

'బెస్ట్ అత్త' గారెవరని ప్రశ్నిస్తే మా అత్తగారి పేరే చేప్తా న్నేను. అంత ప్రేమగా, ఆప్యాయంగా చూసుకునే వారు.

కాలక్రమంలో ఇద్దరమ్మాయిలు పుట్టుకొచ్చారు.

జీవితం రొటీన్ అయిపోయింది. పాపలిద్దరూ స్కూల్‌కి వెళ్లిపోతున్నారు. శ్రీ బిజినెస్ పనిమీద సగం రోజులు కేంప్‌లోనే ఉంటాడు. అత్తగారు, మామగారు స్వర్గస్థులయ్యారు కాలక్రమంలో.

అటువంటి తరుణంలో నాకు వనమాలితో పరిచయం అయ్యింది. ఈ మధ్య కాస్త లావయినట్లనిపించడంతో శ్రీ కోప్పడ్డారు.

''అందమైన నీ ఫిజిక్కుని పాడుచేసుకోకు. అప్పటికీ ఎప్పటికీ నువ్వు మన పెళ్లినాటిలా ఉన్నావు అలాగే ఉండాలి రమ్యా'' అన్నపుడు నేను మాట్లాడలేకపోయాను.

నిజమే. ఈమధ్య కాస్త లావయ్యాను. అవ్వనూ మరి! తిండికి లోటా, డబ్బుకి లోటా! 'కో' అనగానే కొండమీది కోతినైనా తెచ్చిచ్చే శ్రీ ఉన్నాడు! ముత్యాల్లాంటి ఇద్దరాడపిల్లలున్నారు, సంతోషంతో లావెక్కక ఊరుకుంటానా! పైగా 'వద్దుమొర్రో' అన్నా వినిపించుకోకుండా అన్నీ తెచ్చి నోట్లో పెట్టాడు శ్రీ. తినకపోతే కోపం, కాంప్‌లేని రోజులన్నీ క్షణాల్లా దొర్లిపోతాయి.

పిల్లల అల్లరి కంటే మా ఇద్దరి అల్లరే ఎక్కువ ఇంట్లో అంత సరదాగా, ఫ్రెండ్స్‌లా ఉంటాం ఇద్దరం.

నిజానికి శ్రీ లాంటి భర్త దొరకడం పూర్వజన్మ సుకృతం. ''పూలతో పూజ చేశానో తెలిస్తే... ఇప్పుడూ ఆ పూజే చేసేదాన్ని...'' అని శ్రీతో అంటే అతను నవ్వేస్తూ...

''పూలతో కాదు ముద్దులతో చెయ్యాలి పూజ..'' అంటూ అల్లరి మొదలెడతాడు. ప్రతీదీ జోకే అతనికి.

ఇప్పటికి, ఇన్నాళ్లకి నా ఫిజిక్కు మారిపోతుంటే చూళ్లేక కోప్పడ్డాడు. శ్రీకి ఇష్టం లేనిది ఏదీ నాకూ ఇష్టం ఉండదు కాబట్టి సన్నగా కావడానికి డైటింగ్, మార్నింగ్ వాకింగూ మొదలు పెట్టాను.

మా ఇంటికి దగ్గరే ఓ పార్క్ ఉంది కాబట్టి ఎర్లీ మార్నింగ్ ఫైవ్‌కే లేచి వాకింగ్‌కి బయలుదేరుతున్నాను.

తెలతెలవారుతూండడం, పక్షులు కిల కిలమంటూ సందడి చెయ్యడం, దూరంగా వేణుగోపాల స్వామి ఆలయంలో నుండి వినిపించే సుప్రభాతం... ఇవన్నీ నాకెంతో నచ్చాయి. అందుకే తెల్లారికల్లా లేవడం అంటే బద్ధకం అయిన నాకు ఓ చక్కని ఉపోదయం వేళ అలా వాకింగ్ చేస్తు నడవడం మహా గమ్మత్తుగా, ఇష్టంగా ఉంది.


పైగా చిన్నపిల్లల దగ్గర్నుండి ముసలి వాళ్ల వరకు వాకింగ్‌కి వచ్చే వాళ్లని చూస్తుంటే నాకు ముచ్చటేసింది. అందుకే క్రమం తప్పకుండా రెగ్యులర్‌గా వస్తున్నాను.

అలా..... అలా..... వాకింగ్‌లోనే పరిచయం అయ్యాడు వనమాలి. జాగింగ్ చేస్తూ రోజూ కనిపించే వాడు.

పరిచయం పెరిగింది.

అదేవిటో ఎవరితోనైనా ఫ్రెండ్లీగా మాట్లాడే స్వభావం నాది. అందుకేనేమో కొత్తవారితోనైనా ఇట్టే ఇమిడిపోగల్ను.

నేను వాకింగ్‌కి రెగ్యులర్‌గా రావడంతో ఎప్పుడైనా వనమాలి రాకపోతే చిన్నబోయేది.



అతను నవ్వేశాడు.

మా ఇద్దరి మధ్య చెప్పలేనంత అనురాగం, అనుబంధం ఏర్పడసాగాయి రాను రాను.

శ్రీ కేంప్‌కెళ్లినపుడల్లా వనమాలి వచ్చేవాడు. నాకిష్టమైన పాటలన్నీ పాడించుకునేదాన్ని.

రేడియోలో, టి.వి ఛానల్స్‌లో అతనికి రికార్డింగ్ ఉన్నప్పుడు నన్ను తరచూ రమ్మనేవాడు. ఆ ఫీల్డ్ మీద ఉన్న ఇంట్రస్ట్ వల్లా, ఇంట్లో మరో కంపెనీ లేకపోవడం వల్లా నేను తప్పక అన్నిటికీ వెళ్లేదాన్ని.

మాటల సందర్భంలో చెప్పాడు తను సింగర్‌నని. నాకూ పాటలంటే ఇష్టం కాబట్టి అతనితో మరింత పరిచయం పెరిగింది.

తరచూ ఏవో ప్రోగ్రామ్స్‌లో పాడుతున్నట్లు చెప్పేవాడు. ఆ ఫంక్షన్స్‌కి రమ్మనేవాడు.

పాటలంటే చెవి కోసుకునే నేను అతని ఫంక్షన్స్ అన్నీ తప్పనిసరిగా అటెండ్ అయ్యేదాన్ని.

అతని పాటలు వింటూంటే మైమరిచిపోయేదాన్ని.

అంత బాగా పాడతాడు.

ఓ కళాకారుడు కావాలంటే పెట్టి పుట్టాలి. ఎంత దృష్టం చేసుకుంటే తప్ప అలా పాడలేరు.

అదే అనేదాన్ని వనమాలితో.

నా ఇష్టాలు, అతని ఇష్టాలు అన్నీ ఒకటే.

ఎన్నో విషయాల్లో వాదించుకొన్నా, నన్నే సమర్థించేవాడు ఆఖరికి. నేనే రైటని ఒప్పుకునేవాడు.

అలా... అలా... మేం దగ్గరయ్యాం.

ఒక్కరోజు కూడా అతన్ని చూడకుండా ఉండలేని స్టేజ్‌కి వచ్చేసాను. అతనూ అంతే.

డబ్బు కూడా లెక్క చేయకుండా, ఎక్కడున్నా తన దినచర్య మొత్తం 'సెల్' లో చెప్పేవాడు.

అతను చేసే ప్రతిపనీ సిన్సియర్‌గా, కాన్ఫిడెన్స్‌గా చేసేవాడు. బహుశా అందుకేనేమో నేను అతని పట్ల ఇంట్రస్ట్ చూపించడానికి కారణం.

ఒక ఆడ, మగ ప్రేమించుకోవడానికి, ఇష్టపడడానికి ఏ రీజనింగ్‌లూ, లాజిక్కులూ అవసరం లేదని, పైగా వయసు వారికి అడ్డురాదని కూడా మాకు అనిపించసాగింది.

పాటలు పాడితే వచ్చే రిమ్యునరేషన్‌తో అతను నాకు తరచూ చీరలు, రింగ్స్ బహుమతిగా ఇచ్చేవాడు.

అవెంతో నచ్చేవి నాకు.

శ్రీతో అప్పుడప్పుడు అతని గురించి చెప్పేదాన్ని, కానీ మా మధ్య ఉన్న ఇష్టాన్ని, ప్రేమని మాత్రం చెప్పలేకపోయాను.

ఏదో రికార్డింగ్ పనిమీద వనమాలి చెన్నయ్ వెళ్లాల్సి వచ్చింది. పది రోజుల వరకూ రాలేకపోయాడు. రోజూ ఏదో ఒక టైమ్‌లో ఫోన్ చేసేవాడు.

అయినా నాకు అశాంతే!

అతనితో మాట్లాడ్డం ఎంత ప్లజంట్‌గా, ఇష్టంగా అనిపించే నాకు అతను లేకపోతే పిచ్చెక్కుతుందేమో నన్నంత ఫీలింగ్, మొదటిసారిగా అతనంటే నాకెంత

ఇష్టం, ప్రేమ ఉందో అర్థం కాసాగింది.

శ్రీ బిజీలో ఉన్నాడు. కోయంబత్తూర్ వెళ్లాడు.

వనమాలి పూర్నుండి వచ్చాడు ఆరోజే.

సాయంత్రం ఆరింటికి వస్తానని, ఉండమని ఫోన్ చేసి మరీ చెప్పాడు.

నాలో చెప్పలేని ఆనందం.

జాబిలి కోసం ఎదురుచూసే నక్షత్రంలా...

ఆరింటికే ముస్తాబయి...

అతనికెంతో ఇష్టమని చెప్పే తెలుపు రంగు చీరలో, మెళ్లో మల్లెమొగ్గల మాలతో... ఎదురు చూస్తున్నాను.

పిల్లల్ని కావాలనే మా ఆడపడుచు ఇంటికి పంపేశాను. తనువూ, మనసు ఏకమై అతని రాకకోసం ఎదురుచూస్తూ...

నిజానికి పెళ్లయి పిల్లలున్న నేను మరో పరాయి వ్యక్తి కోసం అలా ఎదురు చూడ్డం చాలా సిగ్గనిపించింది. కానీ వయస్సు మనసూ పూరుకుంటేగా...

ఆత్రంగా అతనికోసం ఎదురు చూస్తు... డాబా మీద నిలబడ్డాను.

అతను రానే వచ్చాడు.

గబ గబా మెట్లు దిగి వెళ్లి తలుపు తీసాను.

తెల్లని కుర్తా, పైజమాలో హీరోలా అతను...

''నీకోసమే చూస్తున్నాను వనమాలీ...'' అన్నాను గొంతులో ఆర్థ్రం వినిపిస్తోంది.

''సారీ... అనుకోకుండా లేటయిపోయింది పూళ్లో...'' అన్నాడు, నా కళ్లలో నీళ్లు.

అతను దగ్గరకి వచ్చి కన్నీళ్లు తుడిచాడు.

నేనిక ఆ దూరాన్ని భరించలేనట్లు అతని మెడ చుట్టూ చేతులు వేసి దగ్గరకు జరిగాను.

అతను నా నడుము చుట్టూ చెయ్యేసి మరింత దగ్గరకి లాక్కున్నాడు.

మా ఇద్దరిలోనూ ఆత్రం.

నన్ను అలానే నడిపించుకుంటూ బెడ్‌రూమ్‌లోకి తీసుకెళ్లి మంచం మీద కూర్చోపెట్టాడు.

నాలో ఆపుకోలేని ఆవేశం. అతన్ని చెయ్యి పట్టి మీదకి లాక్కున్నాను.

''నేనంటే ఎందుకంత ఇష్టం రమ్యా...'' అతను నా ముఖాన్ని ముద్దులతో ముంచెత్తుతూ అన్నాడు.


''ఏమో! నాకు తెలీదు...'' అన్నాడు.

అతని మధ్య నా మధ్య ఇక మాటలే కాదు గాలి కూడా చొరబడలేనంత దగ్గరతనం...

ఆవేశంగా అతను...

అనుకోకుండా నేను...

ఇద్దరం సర్వసౌఖ్యాలను అనుభవించాం ఆ రాత్రి. శ్రీతో జరిగిన శోభనం రోజు గుర్తొచ్చింది నాకు. అప్పుడు ఏ థ్రిల్లింగూ లేకుండా, ఏ స్పందనా లేకుండా, రొటీన్‌గా జరిగిపోయింది. ఈరోజు వనమాలితో జరిగిన సంగమమం మాత్రం మర్చిపోలేను.




ఇద్దరు ఆడపిల్లలకి తల్లినయినా ఓ కన్నెపిల్ల శోభనం రోజు ఎంత ఎక్సయిటింగ్‌గా ఉంటుందో అలానే అనిపించింది నాక్కూడా.

వనమాలి క్కూడా పెళ్లయి ఆరేళ్లవుతోందట. ఒక బాబు. వాళ్ల ఆవిడ రమణి అన్నివిధాలా అనుకూలవతి, గుణవతి. అయినా మేం ఇద్దరం విడిపోదలుచుకోలేదు. నా భర్తకి నేను, వనమాలి భార్యకు అన్యాయం చెయ్యనంత వరకూ మేం చేసేది కరక్టేనని మా నమ్మకం.

రోజులు క్షణాల్లో దొర్లిపోతున్నాయి.

ఇప్పుడు 'శ్రీ' కాంప్‌లో ఉన్నా నేను పట్టించుకోవటంలేదు. మొత్తం వనమాలి తోడిదే లోకం అయ్యింది.

ఓరోజు మేమిద్దరం సన్నిహితంగా ఉన్నవేళ శ్రీసూర్య వచ్చాడు కేంప్ నించి.

వనమాలి నిశ్శబ్దంగా వెళ్ళిపోయాడు.

శ్రీ ఏం మాట్లాడలేదు. వెళ్లి కిటికీ దగ్గర నిలబడ్డాడు.

నేను వెళ్లి అతని పాదాలమీద తల ఆన్చి ఏడ్చాను.

''నన్ను క్షమించండీ...! మీకన్యాయం చేస్తున్నానని తెలిసినా, నేను అతన్ని మరచిపోలేకపోతున్నాను, అతనంటే ఎందుకో నాకు చెప్పలేనంత ఇష్టం ఏర్పడిపోయింది. నేనతన్ని విడిచి ఒక్క క్షణం కూడా ఉండలేకపోతున్నాను. అలా అని మీకు అన్యాయం చెయ్యాలని కాదు. మీ ఇద్దరూ నాక్కావాలి. మీ ఇద్దరు నా కిష్టం. దీనికి పరిష్కారం మీరే చెప్పండి, కానీ మీ దూరాన్ని నేను భరించలేను...'' అని ఏడ్చేశాను. బహుశా నాలాంటి క్యారెక్టర్ ఎవరూ ఉండరేమో! అనుకోకుండా మరో వ్యక్తిని ప్రేమించానని, ఇష్టపడుతున్నానని కట్టుకున్న భర్తకే చెప్పి, సలహా అడిగే వ్యక్తిని లోకంలో నేనొక్కర్తినేనేమో అనిపించింది. అయినా ఇది నిజం, నిజాన్ని దాచిపెట్టి ఎన్నాళ్లకి శ్రీసూర్యని మోసం చెయ్యడం.

అందుకే చెప్పేశాను.

హమ్మయ్యా! నాకిప్పుడు నిశ్చింతగా ఉంది అనుకున్నాను. శ్రీ ఏం చెప్పినా నేను చెయ్యడానికి రెడీ.

అతను ముందు వింతగా చూశాడు నావైపు. తరువాత అపనమ్మకంగా చూసాడు.

''ముద్దుగా, అమాయకంగా ఉండే రమ్యేనా ఇలా మాట్లాడేది, లోకంలో ఏ భార్యా ఇలా అడిగి ఉండదు. మరో వ్యక్తిని ప్రేమించి, భర్తనే సలహా అడిగే భార్య ఎక్కడా ఉండదు. నెవ్వర్, పెక్యూలియర్ క్యారెక్టర్.

అయినా...

ఇంత చేసినా నీమీద నాకు కోపం రావటం లేదు. ఎందుకో తెలుసా... నువ్వు నిజాయితీగా, అమాయకంగా అడిగావు కాబట్టి.... ఎక్కడ, ఎలా ఉన్నా నీ క్షేమమే నాకు కావాలి కాబట్టి... నీ ఇష్టం ఉన్నట్టు చెయ్యి...'' అన్నాడు.

నాలో ఏమీ చెప్పలేని భావం.

ఎలా?

ఇపుడెలా?

ఒకరు తాళి కట్టిన భర్త!

మరొకరు మనసును, తనువును హారతిగా అందుకున్న ప్రియుడు,

ఇద్దరూ తన కిష్టమే!

ఇద్దరూ తనక్కావాలి!

ఇద్దరికీ తను కావాలి...

ఇద్దరూ మంచి వాళ్లే, తనని పువ్వుల్లో పెట్టి చూసుకునే వాళ్లే. రెండు కళ్లల్లో ఏ కన్ను నీకిష్టం అంటే ఎవరైనా ఏం చెప్తారు.

'ఉహూ' ఎవరూ చెప్పలేరు. నేనెలా జీవించాలి ఇకముందు. శ్రీసూర్య భార్యగానా? వనమాలి ప్రియురాలిగానా?

ఎటూ తేల్చుకోలేకపోతున్నాను.

ఆలోచనలతో బుర్ర వేడెక్కింది.

'సర్వైవల్ స్పాండిలైటిస్' ఉన్న నేను ఏమాత్రం టెన్షన్‌ని తట్టుకోలేను. దానికి తోడు లో...బి...పి...

నా కథకు దేవుడే పరిష్కారం చూపిస్తాడన్నట్టు, నన్ను తన దగ్గరకి పిలుస్తున్నట్టు అనిపిస్తోంది. అవును నిజం, నాలాంటి పెక్యూలియర్ క్యారెక్టర్‌కి ఈ భూమ్మీద స్థానం లేదనేమో ఆ దేవుడు ఆపకుండా పిలుస్తూనే ఉన్నాడు.

అదిగో... నన్నే... నావైపే చూస్తూ... నేను వెళ్లాలి! శలవా మరి!